ప్రజాశక్తి
ఆదివారం 27 అక్టోబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి- పాడేరు: మినుములూరు పిహెచ్‌సిని విశాఖపట్నం జోనల్ మలేరియా అధికారి డా. వి శాంతిప్రభ శనివారంఆకస్మికంగా సందర్శించారు. ఐటీడీఏ పి.హెచ్.సి పరిధిలో నమోదైన మలేరియా కేసులపై ఆరాతీశారు. వారికి అందించిన చికిత్సలుగూర్చి అడిగి తెలుసు కున్నారు. అందుబాటులో ఉన్న మలేరియా మందులను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధి అదుపునకు తీసుకున్న చర్యలపై .జిల్లా మలేరియా అధికారి కార్యాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు) కందమామిడి స్కూల్ ను సందర్శించారు. ఇటీవల నమోదైన మలేరియా కేసులను పరిశీలించారు. సిక్ రూమ్‌ను తనిఖీ చేశారు. జ్వర లక్షణాలు గల విద్యార్థిని విద్యార్థులకు సకాలంలో గుర్తించి వైద్య పరీక్షలు జరిపి మందులను అందించాలని తెలిపారు. దోమతెరల వినియోగంపై, అవగాహన కలిపించారు. మాస్ రక్తపూతలు సేకరించి ల్యాబ్ పంపించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని పిహెచ్‌సి వైద్యాధికారిని ఆదేశించారు. మినుములూరు వైద్యాధికారి డాక్టర్ సాయిశ్రీ, అసిస్టెంట్ మలేరియా అధికారి శేషయ్య , కన్సల్టెంట్ శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన నేతలు

గురుకుల విద్యార్థి మృతికి కారకుడైన

వైస్ ప్రిన్సిపల్‌ను అరెస్ట్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- బాధ్యునిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్
- బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం, ఉద్యోగం ఇవ్వాలి

ప్రజాశక్తి-అరకులోయ :అరకులోయ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర (పిటిజి) పాఠశాలలో పదో తరగతి విద్యార్థి బడ్నాయిక్ ప్రవీణ్‌కుమార్ కుమార్ మృతికి కారకుడైన వైస్ ప్రిన్సిపల్ వై. రామనరసింహంపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం అరకులోయ మండలకేంద్రంలో విద్యార్థులు, బాధితకుటుంబ సభ్యులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు.ప్రభుత్వ జూనియర్ కాలేజీ కళాశాల నుంచి బిర్యాని అరకులోయ టౌన్‌షిప్ మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తిక్ మాట్లాడుతూ, చదువు పట్ల ఆదిమజాతి గిరిజనులకు ఇప్పుడిప్పుడే మక్కువ ఏర్పడుతున్న పరిస్థితుల్లో గిరిజన విద్యార్థుల్లో మృత్యుఘంటికలు విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనలకు గురిచేస్తున్నా యన్నారు.

ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్ గ్రామానికి చెందిన బోడ్నాయక్. ఈశ్వర్, నీలమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్‌కుమార్ అరుకువేలి ఎపిఆర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువు తున్నాడు. వారం రోజుల క్రితం ప్రవీణ్‌కుమార్‌పై పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ భౌతిక దాడి చేయడంతో స్పృహ తప్పిపోయా డన్నా రు. విషయం తెలుసు కొన్న విద్యార్థి తల్లిదండ్రుల పాఠశాలకు వెళ్లి గట్టిగా నిలదీయగా, అరుకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారని, మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శుక్రవారం మరణించారన్నారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన మాస్టార్లు, ఇలా కర్రలతో విద్యార్థులను దండించడం, మృతికి కారణం కావడం దుర్మార్గమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యుడైన వైస్ ప్రిన్సిపల్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యాలయాల్లో హెల్త్ అసిస్టెంట్లు లేకపోవడం వల్లే అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సకాలంలో, సరైన వైద్యంఅందక మరణిస్తున్నారన్నారు. బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.పదిలక్షల పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని, బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో తరచూ వైద్యశిబిరాలను నిర్వహించా లన్నారు. ప్రవీణ్‌కుమార్ అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేర్పించడానికి, చేర్పించిన తర్వాత గురుకుల యాజమాన్యం సరైన రీతిలో స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులు, మతుడి బంధువులు కేశవరావు, వరప్రసాద్, నాగేశ్వరరావు, మత్స్యరాజు రామరాజు రాము పాల్గొన్నారు.



అరకులోయలో నిరసన ర్యాలీ

వైస్ ప్రిన్సిపల్ కొట్టడం వల్లే మృతి

- బాధిత కుటుంబ సభ్యులు

స్టడీ అవర్స్‌కు లేటుగా వచ్చాడన్న నెపంతో ప్రవీణ్ కుమార్‌ను కొట్టడం వల్లే మృతి చెందాడని విద్యార్థి కుటుంబ సభ్యులు బంధువులు ఆరోపించారు. గురుకులానికి వెళ్లి వాకబుచేయగా తోటి విద్యార్థులే చెప్పారని బడ్నాయికి సుబ్బారావు తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు ఇంతవరకు ఎటువంటి వ్యాధులు, జ్వరాలు లేవని, వైస్ ప్రిన్సిపల్ కొట్టడం వల్లే చనిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.సరైన పర్యవేక్షణ లేని ప్రిన్సిపల్ వెంకటరమణపై చర్యలు తీసుకోవాలన్నారు.



బాధ్యులను శిక్షించాలి

పెదబయలు : అరకు గురుకులంలో విద్యార్థి మృతికి బాధ్యులైన వారిపైచట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు, జిల్లా కమిటీ సభ్యులు జంపరంగి సునీల్ కుమార్, పెదబయలు మండల కమిటీ అధ్యక్షులు బొండా గంగాధరం డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.పదిలక్షల పరిహారం ఇవ్వాలని కోరారు.

హుకుంపేట : అరకులోయలో గిరిజన విద్యార్థిని కొట్టిచంపిన వైస్‌ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదివాసీ గిరిజన సంఘ మండల కార్యదర్శి టి.కృష్ణారావు డిమాండ్ చేశారు.. బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బాధితకుటుంబానికి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగమిచ్చి ఆదుకోవాలని కోరారు

ముంచంగిపుట్టు: గిరిజన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతికి కారకుడైన వైస్ ప్రిన్సిపల్‌ను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

దుర్మార్గ చర్య

చింతపల్లి.: అరకు వ్యాలీ గురుకుల పాఠశాలలో టెన్త్ విద్యార్థి మృతికి కారకుడైన వైస్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాజశేఖర్ డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల పట్ల అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ మండల నాయకులు జి.సిద్ధార్థ, కె. చంటి, బి. వంశీ, పి. శామ్యూల్, జి.రాము ఉన్నారు.

వైస్ ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించాలి

ముంచింగిపుట్టు : అరకులోయ గురుకుల విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతి ఘటనను టిడిపి డివిజన్ నాయకుడు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి తీవ్రంగా ఖండించారు. ఘటనకు కారకుడైన వైస్ ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పరిహారమిచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై భౌతిక దాడి దుర్మార్గం

ముంచింగిపుట్టు :అరకు వ్యాలీ గురుకుల పాఠశాల విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌ను కొట్టి, అతని చావుకు కారణమైన వైస్ ప్రిన్సిపాల్ నరసింహమూర్తిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మండల వైస్ ఎంపిపి కె.సత్యనారాయణ, బోయి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యార్థులను దండించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. బాధిత కుటుంబానికి రూ.పదిలక్షల పరిహారంతోపాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పాంగి భీమరాజు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సిరగం గాసిరం దొర విద్యార్థి మృతి ఘటనను ఖండించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ముంచింగిపుట్టు : అరుకులోయ ఎపిఆర్ గురుకుల టెన్త్ విద్యార్థి, మండలంలోని జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్ గ్రామానికి చెందిన బోడ్నాయక్ ప్రవీణ్‌కుమార్ మృతికి కారకుడైన వైస్ ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వెంగడ జగన్ డిమాండ్ చేశారు. అరుకులోయ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధ్యుడైన వైస్‌ప్రిన్సిపల్‌పై కఠినచర్యలుతోపాటు నిర్లక్ష్యం చేసిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఎన్ఎస్‌యుఐ నాయకులు ఎస్ గణపతి, వి పూర్ణచంద్రరావు, పి సతీష్, వి మహేష్, శ్రీను పడాల్ ఉన్నారు



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

అక్రమంగా బియ్యం నిల్వ చేసిన గురుకుల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విద్యార్థులకు వండి పెట్టాల్సిన బియ్యాన్ని అక్రమంగా తలించేందుకు నిల్వ చేసిన రాజవొమ్మంగి గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సలోమిపై ఉన్నత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలను రామారావు దృష్టికి తీసుకువచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ తమతో బియ్యం బస్తాలు మోయించారని, పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరని, ప్రాక్టికల్‌కు సంబంధించిన నోటు పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. అనంతరం లోతా రామారావు మాట్లాడుతూ విద్యార్థులతో బియ్యం బస్తాలు మోయించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు సక్రంగా మెనూ అమలు కావడం లేదని, కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థుల బాగోగులు చూడటంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. తక్షణమే ప్రిన్సిపాల్‌పై చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట గిరిజన సంఘం మండల అధ్యక్షులు కుంజం జగన్నాథం తదితరులు ఉన్నారు.

తాగునీటి పథకాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

ప్రజాశక్తి-కూనవరం

గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించేందుకు మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని పెద్ద ఆర్కూర్ పంచాయతీ సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి సభ్యులు డి.అమ్మాజీ కోరారు. మంచినీటి మోటార్లకు విద్యుత్ సరఫరా సమస్య గురించి విద్యుత్ సిబ్బందితో వారు మాట్లాడారు. మండలంలోని పెద్ద ఆర్కూర్ పంచాయతీ పరిధిలోని పెద్ద ఆర్కూర్, రేపాక, రేపాక కాలనీ, బండారుగూడెం, భగవాన్ పురం గ్రామాలలో మంచినీటి ట్యాపులకు సంబంధించిన స్టాండ్ పోల్స్ కట్టే పనులు జరుగుతుండగా, వాటిని సర్పంచ్, ఎంపిటిసి శనివారం పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో జరగాలని పంచాయతీ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను నియమించాలని వేడుకుంటున్న వార్డు మెంబర్ ఆనందరావు

చిలకలవీధి పాఠశాలకు టీచర్‌ను నియమించాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం అమ్మోరు దారకొండ పంచాయతీ పరిధి చిలకలవీధి ప్రాథమిక పాఠశాలకు తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎ.దారకొండ పంచాయతీ వార్డు మెంబర్ గుంట ఆనందరావు కోరారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో ప్రస్తుతం 23 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో నెల రోజుల క్రితం వరకు విద్యా వాలంటర్ విద్యా బోధన చేశారని పేర్కొన్నారు. కాని ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో విద్యా వాలంటీర్ నెల రోజుల నుండి పాఠశాలకు హాజరు కావడం లేదని, దీంతో విద్యార్థులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ పిల్లలు ఇళ్లకే పరిమితమవుతున్నారని, పశువులు కాపు, వ్యవసాయ పనులకు వెళ్తూ విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. కలెక్టర్, ఐటిడిఎ పిఓ స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

వాడీవేడిగా మండల సమావేశం

సమస్యలపై అధికారులను నిలదీసిన ఎంపిటిసిలు, సర్పంచ్‌లు



సమస్యలపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపిపి కొండలరావు

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కూడా రాజుబాబు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. పలు సమస్యలపై అధికారులను ఎంపిటిసిలు, సర్పంచ్‌లు నిలదీసి ప్రశ్నించారు. విద్య, విద్యుత్ శాఖలపై చర్చలో నిలదీతలతో సమావేశం రసాభాసగాసాగింది. హుకుంపేట మండల కేంద్రంలో రైతుల భూములను ఆక్రమించిన ఉపాధ్యాయుడు త్రినాథ్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రైతుల భూములను తిరిగి ఇవ్వాలనికోరారు.. హుకుంపేటలో అడ్డుమండ రహదారి పక్కన ఉన్న తాగునీటి బావిని వెంటనే మరమ్మతులు చేపట్టి అందుబాటులో తేవాలని, ప్రభుత్వ కార్యాలయాలు పక్కన మద్యం షాపు ఏర్పాటు చేపట్టకూడదని సర్వసభ్యలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మండలంలో నూతనంగాదచీశీఅవగపాఠశాలలు మంజూరు చేయాలని. ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరవ్వాలని, విద్యాబోధన సరిగా లేదనిఎంఇఒ సోమేలి చెల్లయ్యను వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు తో పాటు ఎంపీటీసీలు సర్పంచులు నిలదీశారు..మండల కేంద్రంలో మోదకొండమ్మ గుడిలో చోరీలు, పంట పొలాల్లో మందుబాబులు ఆగడాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సురేష్‌ను ఎంపిటిసి కొమ్మరమ్మ కోరారు.

మండల కేంద్రంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై 1/ 70 చట్టం పటిష్టంగా అమలుకు డిప్యూటీ తహసిల్దార్ కష్ణారావును తడిగిరి సర్పంచ్ పి రంజిత్ కుమార్ .వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, ఎంపీటీసీలు,సర్పంచ్ ల నిలదీతలతో వాడీ, వేడిగా,జరిగింది. పాఠశాలల్లో మెనూ అమలు బాగోలేదని ప్రశ్నించారు.. సర్వసభ సమావేశంలో అన్ని శాఖ అధికారులు హాజరై తమ నివేదికను ఇవ్వాలని ఎంపిపి రాజుబాబు సూచిచారు. గైర్హాజరు అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించాలని తీర్మానించారు.కార్యక్రమంలో ఎంపిడిఒ రమా దేవి, ,వైస్ ఎంపీపీ ప్రియాంక, ఎంపీటీసీలు మహేశ్వర రావు, బాలకృష్ణ, రజని,మీనా,రమా, సర్పంచ్ లు వెంకట రమణ రాజు, సత్యవతి, అచ్చులమ్మ,మేరీ,ట్రైబల్ వెల్ఫేర్ డిఇఇ ధ్రువ కుమార్, పిఆర్ జెఇ సంజీవ్ రావు, బాకూరు హుకుంపేట పశు వైద్యాధికారులు చరణ్, వరప్రసాద్, సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి, ఎపిఎం ఎస్ అప్పాయమ్మ, ఇసి శంకరరావు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకం గృహ నిర్మాణం పనులు వేగంగా చేయాలని అరకు హౌసింగ్ డిఇఇ రాజుబాబు ఎఇ కాంతి అన్నారు. శనివారం లోతేరు పంచాయతీలో పెదవలస, బొరకలువలన, మంజుగూడ తదితర గ్రామాలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జన్‌మన్ యోజన పథకం కింద లోతేరు పంచాయతీలో 447ఇళ్లు మంజూరయ్యాయని, ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ. 2.39లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణం వేగవంతం చేయాలని, వారం రోజుల్లోనే బిల్లులు చెల్లిస్తామన్నారు.సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్యాంసుందర్, నేతలు శ్రీరాములు, కిల్లో నోబో, కూన రమేష్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-సీలేరు



బచ్చులూరి సమీపంలో ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు ప్రజలు

విశాఖ నుండి చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి జీకే వీధి మండలం ఆర్‌వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, దీని పునర్నార్మాణానికి నిధులు కేటాయించాలని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం శిథిలమైన రహదారిని పరిశీలించి వీడియోలు, ఫొటోలు తీశారు. వీటిని ముఖ్యమంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి, పాడేరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రహదారి ప్రమాదకరంగా ఉందని తెలిపారు. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరి ప్రాణాంతకంగా మారడంతో వాహనచోదకులు భయం గుప్పెట్లో రాకపోకలు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో గర్భిణీ స్త్రీలు బాలింతలు మైదాన ప్రాంతానికి వైద్య సేవలు పొందడానికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆర్‌వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు ప్రధాన రహదారి విస్తరణకు రూ.84 కోట్లు మంజూరు చేయగా, అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయిందని, ఆ నిధులు దారి మళ్లిపోయాయని చెప్పారు. తరువాత అల్లూరి జిల్లా పాడేరు కలెక్టర్‌గా పని చేసిన సుమిత్ కుమార్ చొరవతో సీలేరు నుంచి సప్పర్ల వరకు బీటీ రోడ్డు నిర్మించారని, లంక పాకల నుంచి సప్పర్ల మధ్యలో, దారకొండ ఘాట్ రోడ్లో 12 కిలోమీటర్ల పైగా బీటీ రోడ్డు పనులు నిధులు లేక నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆర్‌వి నగర్ నుంచి- పాలగెడ్డ వరకు రహదారి శాశ్వత నిర్మాణం నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్ స్పందించి త్వరలో ప్రవేశ పెట్టబోతున్న బడ్జెట్లో ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వై.రామవరం మండలం బొడ్డగండి ఎంపీటీసీ కరక వెంకటరమణ, సర్పంచ్ సంధ్యారాణి, సీలేరు సర్పంచ్ పాంగి దుర్గో, మాజీ ఉపసర్పంచ్ కారె శ్రీనివాస్, బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వర్‌రావు, టిడిపి సీనియర్ నాయకులు గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని శనివారం రాజవొమ్మంగిలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చిన ప్రమాదం జరిగిన వారి కుటుంబాన్ని ఆదుకోవటం లక్ష్యంగా 100 రూపాయలుతో సభ్యత్వ చేసుకుంటే 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. అదనంగా రూ.10 వేలు దహన సంస్కారాలకు టిడిపి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు సీహెచ్ శ్రీనివాస్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దరాజు, కార్యదర్శి ఎం డింబకేశ్వరరావు, నాయకులు దంతులూరి శివరామచంద్రరాజు, గణజాల తాతారావు, అనుదీప్, పి సత్తిబాబు, సిహెచ్ అప్పారావు ఎం బుల్లెమ్మ, మాణిక్యం, సావిత్రి, లోతా లక్ష్మణరావు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వాన్ని అందజేశారు. మండల కేంద్రంలో పాటు పంచాయతీ కేంద్రంలో కూడా సభ్యత నమోదును పార్టీ నాయకులు చేపట్టారు.కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎం స్వామి, వి నాగేశ్వరరావు, ఎం సింహాద్రి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

రైతులకు ప్రోత్సాహక నిధులు అందించకపోతే..

కాఫీ సాగు మనుగడకే ముప్పు

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి - చింతపల్లి : కాఫీ రైతులకు ప్రోత్సాహక నిధులు అందించకపోతే కాఫీ ప్రాజెక్ట్ మనుగడపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉందనిసిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస(?) అన్నారు. శనివారంస్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, 2018-2024 మధ్య కాలంలో రూ.520 కోట్లతో అరకు కాఫీ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించిందని,కాల పరిమితిలో ఆ డబ్బులు ఖర్చు పెట్టేసిందన్నారు. కాఫీ రైతులకు నేటికి రూ.62 కోట్లు బకాయి చెల్లించలేదన్నారు. డబ్బులు మొత్తం ఖర్చయిపోయి బకాయిలు చెల్లించకుండా అధికార యంత్రాంగం ఎందుకంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. కాఫీ బోర్డు కూడా ఇటీవల కాలంలో ప్రతి రైతుకు రూ.4 వేలు చొప్పున సుమారు రూ.4 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆ డబ్బులు కూడా రైతుకు ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో కాఫీ రైతులను ఆదుకోకపోతే వారు ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో రైతులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని ఆశించి సాంప్రదాయ పంటలు, చిరుధాన్యాలు సాగు మానేసి వాణిజ్య పంటలైన కాఫీ,మిరియాల మీద దృష్టి సారించారన్నారు. ఇపుడు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం చేయకపోతే గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాల వైపు గిరిజన రైతు మొగ్గు చూపే ప్రమాదం ఉందన్నారు. ప్రత్యామ్నాయ పంటలన్నీ ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం కాఫీ రైతు,కాఫీ పంట పట్ల బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తుందనివేదన వ్యక్తం చేశారు. మన్య ప్రాంతంలో జలజీవన్ మిషన్ పనులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయనిఅసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు,అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడి జల జీవన్ మిషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా గిరిజనులకు తాగునీరు అందించలేని దుర్భర స్థితి ఏజెన్సీలో కనిపిస్తుందన్నారు. జలజీవన్ మిషన్ అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేకమైన దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, మండల కార్యదర్శి పాంగి ధనుంజరావు(?) పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే..

1 నుంచి కాఫీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- పెదబయలు : కాఫీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగోరి(?) సుందరరావు డిమాండ్ చేశారు శనివారం మండలం లొద్దుమెట్ట ఎపిఎఫ్‌డిసి కాఫీ ఎస్టేట్ పరిధిలోని కార్మికులతో సమావేశంలో మాట్లాడుతూ కాఫీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయకపోతే నవంబర్ ఒకటి నుంచి సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. దీనిపై పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ, కార్మిక సంఘంతో చర్చలు జరిపి కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యలను పరిష్కరించలేదన్నారు. విడిఎ పాయింట్ల ప్రకారం కార్మికుల రోజువారి కూలి రేట్లు చెల్లించాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, వారంతపు పేమెంట్ చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కిముడు సిద్ధేశ్వరరావు, సోమన్న, కొర్ర.కొండబాబు, చంటిబాబు, కిముడు పెద్దలక్ష్మి, రాధమ్మ, తుల్లమ్మ, రంభ, మణి పాల్గొన్నారు.

ఇద్దరు గిరిజనులు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి పిహెచ్‌సి పరిధి కోనాపురం పంచాయతీ చప్పిడిలో శనివారం ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. గ్రామానికి చెందిన సార బిమల (48) కొన్నాళ్లుగా క్షయవ్యాధితో బాధపడుతూ, విశాఖ టిబి ఆసుపత్రిలో వైద్యం పొందుతూ ఆరోగ్య విషమించి శనివారం మరణించింది. అదే గ్రామానికి చెందిన వంతల అప్పలస్వామి (46) దగ్గు, ఆయాసంతో రెండురోజులుగా అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన ఇద్దరు మరణించడం, వారి మృతదేహాలను ఒకేసారి, ఒకేచోట దహనసంస్కారాలు నిర్వహించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

-ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించాలి
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అల్లూరి జిల్లా లోని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా అభివద్ధిలో ఐటిడిఎలు భాగస్వాములు కావాలని సూచించారు. ఇక నుండి ప్రతి నెలా నాల్గవ శనివారం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారుల సమావేశం నిర్వహిస్తామన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రానున్న ఐదేళ్ళలో ప్రతి ఏడాది 15శాతం వద్ధి రేటు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి ప్రభుత్వ శాఖలో లక్ష్యాలను మండల, ఐటిడిఎ స్థాయిలో నిర్ణయించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వృద్ధి సాధించడానికి విస్తీర్ణత పెంచడం, ఉత్పత్తి పెరిగే చర్యలు తీసుకోవడం, అధిక దిగుబడి వంగడాలు వినియోగం తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. పిఎం కిసాన్ ఆదార్ సీడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఉద్యాన శాఖ చేపట్టిన పసుపు, జీడి, పైనాపిల్, కాఫీ, మిరియాలు, పంటల అభివద్ధికి చర్యలు తీసుకోవటంతో పాటు ఆయిల్ పాం సాగును పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్‌ఆర్ఇజిఎస్ కింద చేపట్టిన పనులలో ప్రస్తుతం వస్తున్న రూ.261ల సగటును 290 వరకు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జాబ్ కార్డులు లేనివారికి మంజూరు చేయడం, వంద రోజుల పని దినాలను అత్యదిక మందికి కేటాయించడం ద్వారా వృద్ధి రేటు సాధించాలన్నారు. సోషల్ ఆడిట్ లో గుర్తించిన రికవరీలు చేయాలని, లేదా అందుకు పాల్పడిన వారిని గుర్తించి ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి సికిల్‌సెల్ ఎనీమియా బాధితులను గుర్తింపునకు అవసరమైన కిట్లను తెప్పించాలని మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు, మాతా శిశు మరణాలు తగ్గేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైన శిక్షణలు అందజేయాలన్నారు. నాటు మందుల వినియోగం, నాటు వైద్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యా శాఖ సంబంధించి ఉపాధ్యాయులు హాజరు తప్పనిసరిగా వేయాలని, వారి ప్రాంతంలో సిగ్నల్ లేకపోటీ సిగ్నల్ ఉన్న ప్రాంతాన్ని వారి లొకేషన్ మార్చి హాజరు వేయాలని సూచించారు. విద్యార్థుల హాజరును తనిఖీలు చేసి అవకతవకలుంటే చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో హాజరును పర్యవేక్షించాలన్నారు. నిరక్ష్యరాస్యులకోసం ప్రవేశ పెట్టిన ఉల్లాసిని అనే నూతన కార్యక్రమం కింద నిరక్షరాస్య అంగన్వాడి వర్కర్లకు చదవటం రాయటం నేర్పించాలన్నారు. తక్కువ బరువు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.మార్గదర్శి కార్యక్రమం కింద కెరీర్ గైడెన్స్ అందించాలని, రానున్న ఫిబ్రవరి నెలలో కెరీర్ ఫెయిర్ నిర్వహించాలని ఆదేశించారు.

పంచాయతీ రాజ్, గిరిజన, ఆర్‌అండ్‌బి, పిఐయు శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన బర్త్ వెయిటింగ్ హాల్సు, మల్టీ పర్పస్ భవనాలు, జన్ మన్ పథకంలో మంజూరు చేసిన పనులను వేగవంతం చేసి నవంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ్, పాడేరు రంపచోడవరం ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి. అభిషేక్, కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రి, డిఆర్ఓ బి. పద్మావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలదేవ్

గిరిజన విద్యాలయాల్లో భోజన నిర్వహణ బాధ్యతలు...

అక్షయపాత్రకు అప్పగించొద్దు

-ఆశ్రమాలు, హాస్టళ్లలో వంటచేసి పెట్టాలి
-ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
-ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి- పాడేరు : ఆదివాసీ బిడ్డలకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహార పంపిణీ చేయాలని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ధర్మన్న పడాల్‌చ పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. శనివారం పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో ు మాట్లాడుతూ గిరిజన వసతిగృహాలు ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులంలో ఆహారం కలుషితం అవుతుందనే సాకుతో ప్రభుత్వం ప్రైవేటు సంస్థ అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఆహారం వండి పెట్టే బాధ్యత అప్పగించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 747 గిరిజన ఆశ్రమ వసతి గృహాలు ఉన్నాయని, 1,82 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్నారని, 2054 మంది సిబ్బంది వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన వసతులు, సరిపడా సిబ్బంది నియామకాలు చేపట్టాల్సిన ప్రభుత్వం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ నిర్ణయం వల్ల చాలా సమస్యలు ఎదురవుతాయని, సమయానికి విద్యార్థులకు భోజనం అందే పరిస్థితి ఉండదన్నారు. ఆదివాసీ ప్రాంతంలో మండల కేంద్రాలనుండి సుమారు 30 నుండి 50 కిలోమీటర్ల దూరంలో పాఠశాలలు ఉంటాయని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను నిర్వీర్యం చేసి ప్రయివేట్ సంస్థలకు అప్పగించడం ప్రభుత్వవిద్య నుంచి ఆదివాసీలను దూరం చేయడమేనన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే, పోరాటం చేపడుతామని వెల్లడించారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి కొర్ర నరసయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

బొంగిజకు తారురోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ బొంగిజ గ్రామనికి బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎంపిపి శెట్టి. నీలవేణి డిమాండ్ చేశారు. శనివారం అర్ధాంతంగా నిలిచిపోయిన రోడ్డును పరిశీలించారు. తమ ప్రభుత్వ హయాంలో లుంగపర్తి పంచాయతీ చీడివలస మెయిన్ రోడ్డు నుండి కివర్ల పంచాయతీ బొంగజ గ్రామం వరకు రోడ్డు పనులు జరిగాయని, అయితే వర్షాకాలానికి పూర్తిగా మట్టి రోడ్డు పాడైందన్నారు. .కివర్ల, పెద్దకోట ,పినకోట, జీనబాడు పంచాయతీ ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందుకు అవసరమైన బిటి రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీ సర్పంచ్ జన్ని. సన్యాసిరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతపల్లి : గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ దురియ పుష్పలత అన్నారు. శనివారం స్థానిక రామాలయం వీధిలో పాత గ్రామీణ బ్యాంక్ వద్ద నుంచి సోయల్ ఆఫీస్ భవనాల వరకు డ్రైనేజీ, సకల దేవత ఆలయం పక్కన రహదారి మధ్యలో శిథిలమై కల్వర్టు పునర్నిర్మాణ పనులకు స్థానిక ఎంపిటిసిలు దాసరి దార లక్ష్మి, చిందాడ జయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి , టిడిపి అరకు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు లక్కోజు నాగభూషణంలతో కలిసి శంకుస్థాపన చేశారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు నల్లల రాములు, భాను, వైకాపా నాయకులు దాసరి మత్యరాజు, వరహాలు బాబు, లోవరాజు, పాల్గొన్నారు.

విబఎల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:- వెలుగు విఓఎల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే మూడేళ్ల కాల పరిమితి సర్కులర్ రద్దు చేస్తామని టిడిపి సీనియర్ నాయకులు వర్ల రామయ్య గత జనవరిలో విజయవాడ జరిగిన ధర్నా వద్దకు వచ్చి హామీ ఇచ్చారని, చంద్రబాబు తనను పంపించి ఈ మాట చెప్పమని చెప్పారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు స్వయంశక్తి సంఘాలను మూడు సంవత్సరాలకు మార్చే అవకాశం ఉందని చెప్పడం హాస్యస్పదమన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న విఓఎలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా 75 మందిని తొలగించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కాల పరిమితి సర్క్యులర్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న విఓఎలకు ఇన్సూరెన్స్, శ్రమకు తగ్గ వేతనాలు చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు

డోలీ మోతతో విద్యుత్ సామగ్రి తరలింపు

ప్రజాశక్తి -అనంతగిరి : ఇప్పటివరకు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గర్భిణులను ప్రసవానికి ఆసుపత్రులకు తరలించేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక డోలీ సాయంతో మోసుకెళ్లే పరిస్థితి గిరిజన గ్రామాల్లో ఉండగా, ఇపుడు అనంతగిరి మండలం మారుమూల కివర్ల పంచాయతీ, నక్కుల మామిడి గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పనకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌స్తంభాలు, ఇతర సామగ్రిని ఎత్తయిన కొండల నడుమ నుండి కిలోమీటర్ల దూరం భుజంపై మోసి తరలించవలసిన దుస్థితి నెలకొంది పందిరిమామిడి గ్రామం నుండి ఎత్తయిన అటవీ ప్రాంతంలో కొండ కోనల నడుమ సుమారు నాలుగు కిల్లో మీటర్లు దూరం నక్కులమామిడి వరకు గిరిజనులు తరలిచారు. తమకు ఎప్పటికి డోలినుంచి విముక్తి లభిస్తుందని మన్యవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దేముడుకు నివాళ్లర్పిస్తున్న నాయకులు

దేముడుకు ఘననివాళి

ప్రజాశక్తి - చింతపల్లి : సిపిఐ చింతపల్లి మాజీ ఎమ్మెల్యే గొట్టేటి దేముడు 9వ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. గొడ్డేటి దేముడు చిత్రపటానికి సిపిఐ చింతపల్లి, జి. క. వీధి మండలాల కార్యదర్శిలు పేట్ల పోతురాజు, కంచిపాటి సత్తిబాబుల ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గొట్టేటి ఆశయాలను కొనసాగించడం, ఆయన ఆశయసాధనకు కృషి చేయడమే అయనకు ఇచ్చే నివాళి అని పలువురు అభిప్రాయపడ్డారు. దేముడు వ్యక్తిత్వాన్ని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.రహిమాన్ (బుజ్జి), పార్టీ నాయకుడు ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సేగ్గె సత్తిబాబు, మాజీ ఉపసర్పంచ్ గంజారి రమణ, వంతల టిషఉ్యబాబు, గొల్లోరి కామేశ్వరరావు పొట్టుకూరి కామేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా సమకూర్చిన క్రీడా సామగ్రిని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని, విద్యార్థులందరూ విధిగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆటలను ఆడాలని సూచించారు. ఆటల్లో రాణించి, కాలేజీకి మంచిపేరు తేవడంతోపాటు భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు కార్యక్రమంలో కళాశాల క్రీడా ఇంచార్జ్ డాక్టర్ సుభాన్, కళాశాల అధ్యాపకులు ధర్మారావు,బాలరాజు, డాక్టర్ మురళి, సరస్వతి, అన్నపూర్ణ, లాలికుమారి, శోభన్, అఖిల్, మహిళా వసతి గృహం సంక్షేమ అధికారి విజయ, ఫిజికల్ డైరెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

పకడ్బందీగా పశుగణన చేపట్టాలి

ప్రజాశక్తి- అనంతగిరి : 21వ అఖిల భారత పశుగణన సేకరణ పకడ్బందీగా చేపట్టాలని అరకు ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్రమౌళి నాయక్ అన్నారు.ఇంటింటికీ వెళ్లి 16 రకాల జంతువులను గణన చేయనున్నామని, ప్రజలు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ కరదీపికను, వివరాల సేకరణ అనంతరం అతికించే స్టికర్‌లను, ఐడీ కార్డులను, పోస్టర్లను, కరపత్రాలను, కిట్ బ్యాగ్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో అనంతగిరి పశు వైద్యాధికారి డాక్టర్ సందీప్, కాశీపట్నం పశువైద్యాధికారి డాక్టర్ గణేశ్వర రావు, సుంకరమెట్ట పశువైద్యాధికారి డాక్టర్ సీనయ్య, జూనియర్ వెటర్నరీ అధికారి సాంబశివరావు పారా వెటర్నరీయన్స్ , సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:గిరిజన గ్రామాల్లో పశుగణను విజయవంతం చేయాలని పశు వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. శనివారం పశు గణన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సర్వేను ప్రారంభించి రైతు సంక్షేమానికి ఊతమివ్వాలని ఆదేశించారు. వెటర్నరీ అసిస్టెంట్లు సుబ్బారావు, ఏ హెచ్ ఏ లు సంజీవ్, జయరాజు, కుమార్, మహేష్ పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తరగతి గదిలో చదివే ప్రతి విద్యార్థి పట్ల వారి తల్లిదండ్రుల ప్రమేయం తప్పక ఉండాలని, విద్యార్థి చదువు, అలవాట్లు గమనించాలని ఇందు నిమిత్తం జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. నవంబర్ 14న జరిగే మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశంపై జిల్లా విద్యాశాఖ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

విశాఖలో రంజీ సందడి

తొలిరోజు ఇన్నింగ్స్‌లో హిమాచల్ ప్రదేశ్‌పై 295 పరుగులు చేసిన ఆంధ్ర


రసవత్తరంగా సాగుతున్న మ్యాచ్

ప్రజాశక్తి - మధురవాడ : ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ గ్రూప్ - బి రంజీ ట్రోఫీ మ్యాచ్ శనివారం విశాఖ నగర పరిధి పిఎం.పాలెంలోని ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ఆరంభమైంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి హిమాచల్ ప్రదేశ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు తొలి రోజు ఇన్నింగ్స్‌లో గడిచిన 80 ఓవర్లకు 295 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. ముందుగా దిగిన ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్లు అంతగా రాణించలేక తక్కువ పరుగులకే వికెట్లు కోల్పోయారు. మిడిల్ ఆర్డర్‌లో దిగిన కెప్టెన్ ఎస్‌కె.రషీద్ 132 బంతుల్లో 9 ఫోర్లుతో 69 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. జి హనుమ విహారి కూడా అద్భుతంగా రాణించి 115 బంతుల్లో 12 ఫోర్లతో 66 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత దిగిన భారత క్రికెటర్ కెఎస్.భరత్ తన సొంత గడ్డపై మంచి ఆట తీరును ప్రదర్శించాడు. వన్డే తరహాలో కేవలం 39 బంతుల్లో 8 ఫోర్లు 3 సిక్స్‌లతో 65 పరుగులు చేశాడు. తర్వాత దిగిన జి.మనీష్ 31, టి.విజయ్ 21 పరుగులు చేసి తొలి రోజు ఇన్నింగ్స్ ముగిసేసరికి నాటౌట్‌గా బరిలో నిలిచారు. దీంతో ఆంధ్ర జట్టు తొలి రోజు 295 పరుగులు చేసి ఆరు వికెట్లు నష్టపోయింది. బౌలింగ్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టుకు సంబంధించి దివేష్ ఆర్ శర్మ, కెప్టెన్ రిషి ఆర్ దావన్‌లు తలొక రెండు వికెట్లు చొప్పున తీసుకున్నారు. అలాగే అర్పిత్, ముకుల్ తలో ఒక వికెట్ పడగొట్టారు.

సంక్షేమం ఇలాగేనా..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సంక్షేమం, అభివృద్ధి ఏ ప్రభుత్వానికైనా రెండు కళ్లు వంటివి. ఈ మాటలు నిరంతరం రాజకీయ నాయకులు (పార్టీలతో నిమిత్తం లేకుండా) వల్లెవేస్తారన్న సంగతి ఏ తరగతి జనాన్ని కదిపినా చెప్పడం పరిపాటి. విశాఖ నగరంలో బడ్డీ కొట్లు, బార్బర్ షాపులు, కూలీ చేసుకునే జనంలో ఏ ఇద్దరు కలిసినా తాజాగా ఒకటే చర్చ. తాము కోరుకోని మందు షాపులు ఇబ్బడి ముబ్బడిగా వచ్చేస్తూ తమ ప్రాంతాల్లో సామాజిక కల్లోలం సృష్టించబోతున్నాయన్నది వారి మాటల సారాంశం. డిసెంబరు నుంచి కరెంట్ ఛార్జీలు పెరుగుతాయంట.. ఎలా బతకాలి...అన్నది వారి మాటల్లోని ఆందోళన. బండి ముందుకు సాగాలంటే బండిని లాగే ఎడ్లు ముందుండాలి.. కానీ పాలకులు మాత్రం బండికి ఎనకాల ఎడ్లను కడుతున్నట్లు కనిపిస్తోంది. దీనివల్ల ముందుకెళ్లాల్సిన బండి వెనక్కి పోతోంది. సంక్షేమ పథకాల కేలెండర్ కథ అడ్డం కొట్టేసిందా ? అంటూ ఇప్పటికే పలువురు కూటమి సర్కారు తీరుపై నివ్వెరపోతున్నారు..



పథకాల్లేకపోతే పేదల జీవనం అంతంతే...

2024 ఎన్నిలకు ముందు 'సూపర్ -6' పథకాల గురించి రాష్ట్ర ప్రజానీకం ఎన్నో కలలు కనడం తెలిసిందే. ఈ సంక్షేమ పథకాలు కూడా సామాన్యుడి సామాజిక, ఆర్థిక పరిపుష్టికి ఎంతగానో దోహదపడతాయి. సూపర్ 6పై నమ్మకంతోనే 'కూటమి పార్టీల వైపు భారీ రాజకీయ గాలి' వీచిన సంగతి తెలిసిందే. అమలు చూస్తే ఎప్పుడు ఏ పథకం వస్తుందో ? రాదో తెలియని అగమ్యగోచర స్థితి నేడు నెలకొంది. మత్స్యకారుడి భరోసా కింద రూ.10 వేలు ఏటా వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిపివేసింది. సెలూన్ షాపుల యజమానులకు గతంలో ఎంతోకొంత ఆర్థిక సాయం అందేది. ఇప్పుడు లేదు సరికదా.. కరెంట్ బిల్లుల భారం రూ.6 వేల కోట్లకుపైగా పడనుందని ప్రధాన పత్రికల్లో శనివారం వచ్చిన వార్తలు చూసిన సెలూన్ షాపు యజమానులు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు లభించేది. ఇవి ఎటూ చాలడం లేదని కేసులు, పన్నులు కట్టడానికే సరిపోతుందంటూ గగ్గోలు పెట్టేవారు. ప్రస్తుతం కేసులు, ట్యాక్సులు అలాగే ఉన్నా ఒక్క రూపాయి కూడా వీరికి అందకపోవడంతో ఆటోవాలాలు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ఉచిత ఇసుక.. పట్టలేదా పక్కదోవ!

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే చర్చ. విశాఖ నగరంలో విపరీతంగా భవన నిర్మాణాలు సాగుతున్నాయి. పేదోడి ఇంటికి మాత్రం గుప్పెడు ఇసుక చేరడం లేదు. ఎడ్లబండిలో తోలడం నగరాల్లో సాధ్యమేనా ? కాబట్టి ఈ పథకం ఇక్కడ గగనమే. దేవరాపల్లి, చోడవరం ప్రాంతాల్లో చూస్తే ట్రాక్టర్లతో కొందరు ఉదయం పూట శారదా నది నుంచి తీసేస్తున్నారు. దగ్గరలోగల ఒక చోటకు డంప్ చేస్తున్నారు. లారీల్లో అక్కడ నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. ఉచితం పక్కదోవ పట్టడం కాదా ? పోలీసులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. మద్యం షాపుల తతంతం అంతా ఇంతా కాదు. నగరంలోని గోపాలపట్నం, పందిమెట్ట, సుభాష్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా ఇలా పదుల సంఖ్యలో షాపులేర్పాటును అక్కడి జనం వ్యతిరేకిస్తున్నారు. జనావాసాల మధ్య వద్దంటూ గగ్గోలు పెడుతున్నా పట్టించుకున్న నాధుడులేడు. మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడొస్తుందో పాలకులే చెప్పాలి.

ఎన్‌టిఆర్ వైద్య సేవ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కూనవరం : ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో 17 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు డిమాండ్ చేశారు. కూనవరంలో పని చేస్తున్న ఎన్‌టిఆర్ వైద్య సేవ సిబ్బందితో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్‌టిఆర్ వైద సేవ పథకంలో వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానిటరింగ్ యూనిట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేనతం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 17 ఏళ్లుగా అరకొర జీతాలతోనే తమ కుటుంబాలను నెట్టికొస్తున్నారని వాపోయారు. ఇప్పటికే కొంత మంది రిటైర్మెంట్ అయ్యారని, చాలా మంది రిటైర్మెంట్ వయసుకు దగ్గరలో ఉన్నారని, వారికి ఎలాంటి ప్రయోజనాలు ప్రభుత్వం కల్పించడం లేదని పేర్కొన్నారు. 17 సంవత్సరాల సర్వీసును పరిగణనలోకి తీసుకొని కేడర్ కల్పించి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని, చనిపోయిన ఉద్యోగులకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు రూ.10 లక్షల గ్రాడ్యూటి చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ఈ నెల 29 నుండి సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగులు డి.సర్వేశ్వరరావు, పి.సుహాసిని పాల్గొన్నారు

28న ధర్నాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విఆర్.పురం : నవంబర్ నెలలో విడుదలయ్యే మెగా డీఎస్సీలో 5వ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలు 100శాతం ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని, అవసరమైతే ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని, జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 28న సోమవారం మండల కార్యాలయాల వద్ద జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిఒ 3ను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టిడిపి కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చిన తరువాత హామీని పక్కనబెట్టి మెగా డీఎస్సీకి సిద్ధమవడం దారుణమన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి జీవో నెంబర్ 3ని పునరుద్ధరించిన తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత సోడే చందు, పులి అశోక్, గౌతమ్ కుమార్, విశ్వంత్, ముత్యాల రెడ్డి, దుర్గాప్రసాద్, కన్నారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్ములవాడ పాఠశాలకు తాత్కాలిక ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములవాడ ప్రాథమిక పాఠశాలకు తాత్కాలిక ఉపాధ్యాయుని అధికారులు నియమించారు. గతేడాది జూన్ నుంచి ఈ పాఠశాలకు టీచర్ లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఈనెల 24న పాఠశాల వద్ద ఆందోళన చేపట్టిన విషయం విధితమే. దీనికి జీకే వీధి మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. దుప్పిలివాడ పంచాయతీ గొర్రిలోవలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని ఈనెల 25 నుంచి తాత్కాలికంగా కొమ్ములవాడ ప్రాథమిక పాఠశాలకు నియమించారు. ఈ సందర్భంగా జీకే వీధి ఎంఈఓ-2 మాడి రామన్న ప్రజాశక్తితో మాట్లాడుతూ పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు. కొమ్ములవాడ పాఠశాలకు పూర్తిస్థాయి ఉపాధ్యాయురాలుగా కొనసాగడానికి సోమవారం ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. దారకొండ పంచాయతీ గంగవరం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరిని పెట్రాయి పాఠశాలకు నియమిస్తూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఆసుపత్రుల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వాసుపత్రికి వచ్చే నిరుపేదలకు అందించే వైద్య సేవలు మరింతగా మెరుగ్గా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన నగరంలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి, మానసిక ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ముందుగా ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిని సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి చెక్ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ మానసిక ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను, రోగులకు అందుతున్న చికిత్స పద్ధతులను పరిశీలించి వార్డుల్లో రోగులతో మాట్లాడి తన సంతృప్తిని వెళ్లబుచ్చారు. పలు వార్డులను తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకులు, వివిధ విభాగాల వైద్యాధికారులలకు తగు సూచనలు చేశారు.